andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 : కనిష్ఠం 23.7
నిర్మల్ జిల్లా వార్తలు
8
మంగళవారం 17 సెప్టెంబరు 2024



'విద్యుత్ ఉద్యోగులకు నిమజ్జన బాధ్యతలు'

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 16: జిల్లాకేంద్రంలో మంగళవారం వినాయక నిమజ్జన సందర్భంగా ఉద్యోగులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు నిర్మల్ సర్కిల్ సూపరిండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తొలగించి నిరంతర విద్యుత్ సరఫరాకు వీరు కృషి చేస్తారన్నారు. ఫీడర్ల వారీగా సిబ్బంది అందుబాటులో ఉంటారని,కంట్రోల్ రూం మొబైల్ సిబ్బంది, మానిటరింగ్ అధికారులను నియమించామన్నారు. అన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్ ఆపరేటర్లు సాయంత్రం 4గంటల నుంచి అందుబాటులో ఉంటారన్నారు.

ఎన్ఆర్ఐ పాలసీపై కదలిక



- గల్ఫ్ బాధితుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చొరవ
- నేడు సంఘాలతో సీఎం సమీక్షా సమావేశం
- బాధితుల కుటుంబాలలో కొత్త ఆశలు
- జిల్లావ్యాప్తంగా గల్ఫ్ దేశాల్లో కార్మికులుగా 40వేల మందికి పైగా యువత

నిర్మల్, సెప్టెంబరు 16: గత పదేళ్ల నుంచి గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నారై పాలసీని అమలు చేయాలంటూ కార్మిక సంఘాలు చేస్తున్న డిమాండ్‌కు ఎట్టకేలకు సీఎం రేవంత్‌రెడ్డి పరిష్కార మార్గం చూపబోతున్నారు. ప్రతీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఉత్తర తెలంగాణ జిల్లాలోని గల్ఫ్ కార్మిక కుటుంబాలు ఎన్నారై పాలసీ కోసం పట్టు పడుతున్నాయి. అయితే అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నారై పాలసీని అమలు చేస్తామంటూ కూడా హామీలు ఇచ్చింది. పార్టీ మేనిఫెస్టోలో సైతం ఈ అంశాన్ని చేర్చి ఊరూరా గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు భరోసా ఇచ్చి ప్రయత్నం చేసింది. ఆ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు ఎన్నారై పాలసీపైన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పాటు గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థాయి చేపట్టాల్సిన ఏ ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదు. దీంతో మొన్నటి అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో గల్ఫ్ కార్మిక బాధిత కుటుంబాలన్నీ బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను వ్యతిరేకించాయి. కాగా కాంగ్రెస్ పార్టీ ఎన్నారై పాలసీని అమలు చేస్తామంటూ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. దీంతో పాటు ఆ పార్టీ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి గల్ఫ్ కార్మిక సంఘాలతో వేర్వేరుగా సమావేశమయ్యాయి. కాగా ప్రస్తుతం ఎన్నారై పాలసీని అమలు చేయాలంటూ క్రమంగా పెరుగుతున్న డిమాండ్‌ను సీఎం పరిగణలోకి తీసుకొని గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులతో ఈనెల 17న ప్రత్యేకంగా సమావేశం కాబోతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, కామారెడ్డి, నిజామాబాద్, తదితర జిల్లాలో లక్షలాది మంది గల్ఫ్ కార్మికులు ఎడారి దేశాలలో వలస జీవితం పడుతున్నారు. గల్ఫ్ కార్మిక సంఘాలతో సమావేశం సీఎం రేవంత్ సమావేశం ఏర్పాటు చేయబోతుండడంతో పాటు కార్మిక కుటుంబాలన్నీ ఎన్నారై పాలసీపై ఆశలు రెట్టింపు చేసుకుంటున్నాయి. నిర్మల్ జిల్లాలో దాదాపు 40వేల మందికి పైగా యువత గల్ఫ్ దేశాల్లో కార్మికులుగా పని చేస్తున్నారు. తమ కుటుంబాలకు దూరమై తక్కువ వేతనాలతో తీవ్రమైన పని భారంతో వారంతా ఎంతో శారీరకంగా మానసికంగా కృంగిపోతున్నారు. అయినప్పటికీ కుటుంబాల కోసం మండే ఎండలో వారు జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నారై పాలసీని అమలు చేస్తే గల్ఫ్ కార్మికుల సమస్యలు దూరమవుతాయని చెబుతున్నారు.



గల్ఫ్ కార్మికుల సంక్షేమ కమిటీ సమావేశానికి హాజరైన డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు

గల్ఫ్ కార్మిక సంఘాల డిబాండ్లు ఇవే..

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నారై పాలసీ (ప్రవాసి విధానం) ప్రకటించాలి. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ.500 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలి. గల్ఫ్ దేశాల్లో మరణించిన వలస కార్మికుల కటుంబాలకు ప్రభుత్వం ద్వారా రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలి. గల్ఫ్ జైలులో మగ్గుతున్న వలస కార్మికులకు న్యాయ సహాయం అందూట్లే చేయాలి. గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి. గల్ఫ్ వలస కార్మికుల పేర్లను రేషన్ కార్డులలో కొనసాగించి వారందరికీ ఆరోగ్యశ్రీ పథకం వర్తింజేసేట్లు చేయాలి. ప్రవాసి యోగక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టాలి. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు రిక్రూటింగ్ వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా గల్ఫ్ దేశాలకు వలస వేళ్లే వారి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా, మండల, గ్రామస్థాయిలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలి

గల్ఫ్ చట్టాలపై అవగాహన కల్పించాలి

ప్రతీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్ఆర్ఐ విభాగంలో ఏర్పాటు చేయాలి. ప్రతియేటా తెలంగాణ దివస్‌ను అధికారికంగా నిర్వహించాలి. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. అలాగే కేంద్ర ప్రభుత్వ ఎంబసీలలో తెలుగు అధికారులను నియమించాలి. హైదరాబాద్‌లో సౌదీ ఎంబసీని ఏర్పాటు చేయాలి. ప్రవాస భారతీయ బీమా యోజన ఏర్పాటు చేయాలి. ప్రవాస భారతీయ బీమా యోజనలో జీవిత బీమాను చేర్చాలి. అంతేకాకుండా ప్రవాసి భారతీయులందరికీ ఆన్‌లైన్ ఓటింగ్ లేదా పోస్టల్ బ్యాల్ సౌకర్యం కల్పించాలని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సీఎం మీటింగ్ ఏర్పాటు చేయడం అపూర్వ ఘట్టం

: షబ్బీర్ పాషా, గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

కార్మికుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం ఓ అపూర్వ ఘట్టం. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ ఎన్నారై పాలసీకి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించింది. దీనికి అనుగుణగానే సీఎం మీటింగ్ కోసం చొరవ చూపడంతో గల్ఫ్ కార్మికుల కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం ఎన్నారై పాలసీని రూపొందిస్తోందని ఆశిస్తున్నాం. ఎన్నారై పాలసీతో గల్ఫ్ కార్మికుల కుటుంబాల్లో భద్రత నెలకొంటుంది. కార్మికులలో కూడా ఉత్సాహం రెట్టింపు అవుతుంది.

గల్ఫ్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

: స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవడం అభినందనీయం. ఆయన హయాంలోనే గల్ఫ్ కార్మికుల సమస్యలు తీరుతాయని నమ్మకం ఉంది. కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి. గత ఆరున్న ఏళ్లలో దాదాపు 1300 మంది గల్ఫ్ దేశాలలో మన రాష్ట్ర కార్మికులు మరణించారు. మరణించిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి. గల్ఫ్ కార్మికులను ఆదుకునేందుకు 24 గంటల హెల్ప్ లైన్‌ను అందుబాటులో ఉంచాలి. ఈసీఆర్ (ఇమిగ్రేషన్ క్లియరెన్స్ రిక్వైర్డ్) పకడ్బందీగా అమలు చేయాలి. ఈసీఆర్ పరిధిలోకి సింగపూర్ దేశాన్ని ధనవంతులైన ఎన్నారైలు ఇక్కడి గ్రామాలను దత్తత తీసుకునే విధంగా ప్రోత్సహించాలి.







ఇథనాల్ పరిశ్రమ రద్దు వరకూ పోరాడుదాం

- కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఆత్రం సుగుణక్క

దిలావర్‌పూర్, సెప్టెంబరు 16 : మీ పోరాటం ఫలించాలి... ఇథనాల్ పరిశ్రమ రద్దు కావాలని మనసారా కోరుకుంటున్నానని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. సోమవారం గుండంపల్లి, దిలావర్‌పూర్ గ్రామాల్లో ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబారాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజాభి ప్రాయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు పనిచేయదని అన్నారు. రాజకీయాలకు అతీతంగా చేస్తున్న మీ ఉద్యమం విజయవంతం కావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందన్నారు. మీ అందరితో కలిసి వస్తే ఒకసారి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సమస్యను వివరిద్దామన్నారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లే బాధ్యతను తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. మీ ఉద్యమానికి నా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. నాడు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి చేసిన మహా పాపమే ఇథనాల్ పరిశ్రమ అని అన్నారు. ఇప్పటికైనా ప్రజాభిప్రాయాన్ని గౌరవించి రాజకీయాలు పక్కన పెట్టి ఇథనాల్ పరిశ్రమ రద్దుకు సహకరించాలని ఆమె అన్నారు. కాగా ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి మొట్టమొదట మద్దతు ప్రకటించిన నాయకురాలు ఆత్రం సుగుణక్కనేనని, అందులోను ఆమె అధికార పార్టీ నాయకురాలు కావడం గమనార్హమని పలువురు అన్నారు. కార్యక్రమంలో వ్యతిరేక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న ఆత్రం సుగుణక్క

వాగులో పడి ఒకరి మృతి



గణపతి మృతదేహం

సారంగాపూర్, సెప్టెంబరు 16 : మండలంలోని ఆలూర్ గ్రామానికి చెందిన గణపతి(41) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు స్వర్ణవాగులో పడి మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం స్వర్ణవాగులోకి స్నానం చేయడానికని వెళ్లిన గణపతి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో స్వర్ణ వాగులో గాలింపు చేయగా సోమవారం మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్ర వినాయకుడికి ప్రత్యేక పూజలు

తానూర్, సెప్టెంబరు 16 : మండలంలోని భోసి గ్రామంలో మహాదేవుని ఆలయంలో కొలువుదీరిన శ్రీ కర్ర వరసిద్ధి వినాయకుని దర్శనానికి సోమవారం భక్తులు లక్షకుపైగా వచ్చి దర్శించుకున్నారు. ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రామరావు పాటిల్ ఆదివారం రాత్రి కర్ర వరసిద్ధి వినాయకుని సన్నిధికి చేరుకొని స్వామి వారికి పంచామృత అభిషేకంతో పాటు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువాతో సత్కరించి కర్ర వినాయకుని ప్రతిమను అందజేశారు. ఎమ్మెల్యేగా రామరావు గెలుపొందితే వెండి గణపతిని ముడుపుగా చెల్లిస్తానని ఎమ్మెల్యే అభిమాని భోసిగ్రామ వాసి దోని శ్రీనివాస్ మొక్కుకోగా, ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా మొక్కు తీర్చుకున్నారు. నిర్మల్ జిల్లా జడ్పీ వైస్‌చైర్మన్ బాశెట్టి సాగరబాయి, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్నలు కర్ర వినాయకుని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నిజామాబాద్‌కు చెందిన రచ్చ నరేశ్, బృందంతో ఆదివారం రాత్రి నిర్వహించి భారత నాట్య నృత్యాలు భక్తులను అలరించాయి.



వినాయకునికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రామారావుపాటిల్

సోలార్ బ్యాటరీ చోరీ

కుభీర్, సెప్టెంబరు 16 : మండలంలోని వ్యవసాయ చేన్‌లో ఏర్పాటు చేసిన సోలార్ సెట్‌లోని బ్యాటరీలను ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేసినట్లు సంబంధిత రైతు తెలిపారు. వన్యప్రాణుల నుంచి పంటలను రక్షించేందుకు జాంగాం గ్రామానికి చెందిన సిందే దత్తురాం, సగ్గం వెంకన్న, లక్ష్మణ్ అనే రైతులు తమ పత్తి, సోయాబీన్, మొక్కజొన్న పంటలను అడవి పందులు వణ్యప్రాణుల నుంచి పంటను రక్షించుకునేందుకు ఇటీవల ఒక్కో రైతు సుమారు రూ. 20వేలు ఖర్చు చేసి ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇంతకుముందు సర్వీసు వైర్ల చోరీ, విద్యుత్ తీగల చోరీ జరిగిందని, పోలీసులు తమ గ్రామం వైపు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని కోరారు.



చోరీకి గురైన సోలార్ బ్యాటరీ

టీపీసీసీ చీఫ్‌తో ముథోల్ మాజీ ఎమ్మెల్యే భేటీ

భైంసా, సెప్టెంబరు 16 : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బి.మహేష్ కుమార్ గౌడ్‌తో ముథోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి మర్యాద పూర్వకంగా బేటీ అయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో పలువురు ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులతో కలిసి టీపీసీసీ చీఫ్ బి.మహేష్ కుమార్ గౌడ్‌ను కలిశారు. పార్టీ రథసారథిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకొని బి.మహేష్ కుమార్ గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి ఘనంగా సన్మానించి బాసర అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య తాజా రాజకీయ పరిస్థితులు, నియోజకవర్గ పరిధిలో పార్టీ స్థితి గతులు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు బాసర అమ్మవారి ఆలయం, ట్రిపుల్ ఐటీ అంశాలు చర్చకు వచ్చినట్లుగా తెలిసింది.

నిమజ్జనానికి అందరూ సహకరించాలి

- ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌కల్చరల్, సెప్టెంబరు 16 : నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించే వినాయక నిమజ్జనం విజయవంతం అయ్యేందుకు అందరూ సహకరించాలని ఎస్పీ జానకీషర్మిల కోరారు. సోమవారం స్థానిక గుల్జార్ మార్కెట్ సందర్శించారు. వినాయక నిమజ్జనం శోభాయాత్ర వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. శాంతియుతంగా నిమజ్జనానికి సహకరించాలని ప్రజలను కోరారు. డీఎస్పీ గంగారెడ్డి, సీఐ, కౌన్సిలర్ తాహీదుద్దిన్ పాల్గొన్నారు.

- కంట్రోల్‌రూమ్‌కు సీసీ కెమెరాల అనుసంధానం...

వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన సీసీటీవీలు పోలీసు కంట్రోల్‌కు అనుసంధానం చేసినట్టు ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బయటి నుంచి వచ్చే 400ల పోలీసు సిబ్బందితో పాటు 300ల మంది జిల్లా పోలీసులు మొత్తం 700ల మందితో గట్టి భద్రత చర్యలు చేపట్టామన్నారు. గణేష్ మండల నిర్వాహకులు నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు సమయపాలన పాటించి సహకరించాలన్నారు. స్థానిక బుధవార్‌పేట్ నెంబర్ 1 గణపతిని ఎస్పీ దర్శించుకున్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కుభీర్, సెప్టెంబరు 16 : మండల కేంద్రం కుభీర్‌లోని హెచ్‌పీ పెట్రోల్‌పంప్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే చనిపోయినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. వివరాల ప్రకారం... మృతుడు పల్సి గ్రామానికి చెందిన పురంశెట్టి రాజారాం(27) సోమవారం తన పెద్దనాన్న కొడుకు అయిన పరుశురాంతో కలిసి పని నిమిత్తం పల్సి నుంచి కుభీర్‌కు ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గ మధ్యలో హెచ్‌పీ పెట్రోల్‌పంప్ వద్ద, కుభీర్ నుంచి పల్సికి వ్యాన్‌డ్రైవర్ మహేందర్ వ్యాన్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో వ్యాన్‌తో ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో పురంశెట్టి రాజారం అక్కడికక్కడే మృతిచెందగా పరుశురాం గాయాలపాలయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఢిల్లీలో సదస్సుకు కాల్వ గ్రామస్థురాలి ఎంపిక

దిలావర్‌పూర్, సెప్టెంబరు 16 : దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకం సదస్సుకు మండలంలోని కాల్వగ్రామానికి చెందిన మహారాజు లక్ష్మి ఎంపికైంది. ఈ మేరకు ఆమెకు సమాచారం అందింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ నెల 20వ తేదీన జరిగే ఈ సదస్సుకు ఒక్కో రాష్ట్రం నుంచి ఒకరిని ఎంపిక చేయగా మన తెలంగాణ రాష్ట్రం నుంచి మహారాజు లక్ష్మికి అవకాశం దక్కింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా మహారాజు లక్ష్మి చెక్కు అందుకోనున్నారు. దీంతో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మహారాజు లక్ష్మిని అభినందించారు. శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహారాజు లక్ష్మిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

సదా మీ సేవలో...
పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్న యెడల ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..
నిర్మల్ - 99854 03060
భైంసా - 81258 56776
అసిస్టెంట్ సర్కులేషన్ మేనేజర్: 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451



పాడి పంటలు, సుఖ శాంతులతో ఉండాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

జైనథ్ రూరల్, సెప్టెంబరు 16: నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో గల ప్రజలు పాడి పంటలతో ఉండాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ వేడుకున్నారు. గణేష్ నిమజ్జనోత్సవం చివరి రోజు అయిన సోమవారం జైనథ్ మండలంలోని కాప్రీ గ్రామంలో గల సర్వగణేషునికి వేద మంత్రాల మధ్య ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాప్రీగ్రామస్థులతో కలిసి వినాయకుని శోభయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాప్రీ గ్రామంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాప్రీ గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.


కాప్రీలో గణేషునికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

వాడవాడలా అన్నదానం

బోథ్, సెప్టెంబరు 16: మండల కేంద్రంలోని కొత్త గల్లీ లో గణేష్ మండపం వద్ద మాజీ ఎంపీటీసీ కుటుంబ సభ్యులు షేక్ షాకీర్ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కులమతాలకు అతీతంగా షేక్ రజియా బేగం, షాకీర్లు కార్యక్రమం నిర్వహించడం అభినందనీయ మని పలువురు పేర్కొన్నారు. కాగా, మండల కేంద్రంలోని విద్యార్థి గణేష్ మండలి బ్రదర్స్ యూత్ హనుమాన్ గణేష్ మండలి సైనిక యూత్ సినిమా యూత్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

బోథ్: మండల కేంద్రంలోని విద్యార్థి గణేష్ మండలి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు స్థానిక ఎస్సై ప్రవీణ్, మాజీ జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్ పాల్గొని వచ్చిన భక్తులకు భోజనాన్ని వడ్డించడం జరిగింది.

నేడు నిర్మల్‌లో సంతాన సాఫల్య వైద్య శిబిరం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 16 : నిర్మల్ పట్టణంలోని డాక్టర్ రమేష్ రెడ్డి నిర్వహిస్తున్న తిరుమల నర్సింగ్ హోం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మంగళ వారం ఉదయం 10 గటలకు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహి స్తున్నట్లు డాక్టర్ రమేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంతానం లేని మహిళలు ఈ అవకాశాన్ని ఉపయో గించు కోవాలని కోరారు. హైదరాబాద్‌కు చెందిన ఆవిర సంతాన సాఫల్య కేంద్రానికి చెందిన నిష్ణాతులైన వైద్య నిపుణుల బృందం హాజరవుతున్నారని తెలిపారు.

ఘనంగా మిలద్ ఉన్ నబి

ఆదిలాబాద్, సెప్టెంబరు 16: మహ్మద్ ప్రవక్త చూపిన శాంతి మార్గంలో పయని స్తూ ఆదర్శంగా ఉండాలని ఖానాపూర్ జోహర మసీద్ ఇమామ్ ముఫ్తి మహ్మద్ జాకీర్ హుస్సేన్ అన్నారు. సోమవారం ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మిలదున్‌నబి వేడుకలను కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవక్త చూపిన మార్గాన్ని తెలియజేశారు.

నిధులు మంజూరు


బోథ్, సెప్టెంబరు 16: మండలంలోని సోనాల గ్రామంలోని మున్నూరు కాపు సం ఘం భవనానికి 10 లక్షల రూపాయల నిధులు మాజీ మంత్రి జోగు రామన్న ద్వారా ఎంపీ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర సహకారంతో మంజూరు చేయడం జరిగిందని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. గతంలో మున్నూరు కాపులకు ఇచ్చిన హామీ మేరకు మాజీ మంత్రి చొరవ తో నిధులు తీసుకురావడం జరిగిందన్నారు.

గణేష్ మండలికి ఆర్థిక సహాయం

నార్నూర్, సెప్టెంబరు 16: మండల కేంద్రం ఎస్సీ కాలనీ రాజా గృహ గణేష్ మండలికి స్థానిక మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ రూ.ఏడు వేల ఆర్థిక సహాయం అందిం చారు. సోమవారం వినాయకున్ని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ ప్రజలు కలిసి శోభయాత్ర ప్రారంభించారు. కాలనీ వాసులతో కలిసి డ్యాన్స్ చేసి సందడి చేశారు. కార్యక్రమంలోపేసా కమిటీ కో ఆర్డినేటర్ శిఖేందర్‌రాథోడ్ మాజీ ఉప సర్పంచ్ మహేందర్, కోరల భూమన్న, జిల్లాపెల్లి రమేష్‌కుమార్, మోరేశ్రీకాంత్, కోరాల మహేందర్, ప్రవీణ్, బాలాజీ, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





















కాంగ్రెస్ ఆధ్వర్యంలో నేడు తెలంగాణ విలీన దినోత్సవం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 16 : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 8:30 గంటలకు డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో తెలంగాణ విలీన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీహరిరావు జాతీయ పతాకా విష్కరణ చేస్తారన్నారు.

కలెక్టరేట్‌లో విలీన దినోత్సవం...

కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు నిర్మల్‌కు ఫైనాన్స్ కమిషన్ చైర్మన్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 16 : తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మంగళవారం నిర్మల్‌కు రానున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని పురస్కరించుకొని డీసీసీ కార్యాలయంలో ఉదయం 8:30 గంటలకు, కలెక్టర్ కార్యాలయంలో 10:30 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 16 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతి నగర్ కాలనీలో ఓ అనాథ మహిళ మృతిచెందగా మంగళవారం నిర్మల్ హృదయ సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. సాధం ఆనంద్, వై. సాయన్న, వెంకటేశ్వర్ రావు, ఎం. ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్‌కల్చరల్, సెప్టెంబరు 16 : నిర్మల్ మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి రమణారావు హాజరయ్యారు. అధ్యక్షుడిగా కే.శంకర్, ప్రధాన కార్యదర్శిగా బాలశంకర్, పరమేశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడిగా ముత్తన్న, కార్యదర్శిగా యు.రవి, మహిళా ఉపాధ్యక్షురాలిగా బి.రాజశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు నాయకులు తెలిపారు. వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీనగర్ వినాయకుడికి నిమజ్జన శోభాయాత్ర

నిర్మల్ టౌన్, సెప్టెంబరు 16 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీ ప్రతిష్ఠించిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో లంబోధరుడిని కాలనీ వీధుల గుండా సాంప్రదాయబద్ధంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. బాజాభజంత్రీలతో కోలాటాలతో, డీజే చప్పుళ్లతో ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

విశ్వకర్మ యోజన పథకంతో ప్రయోజనం

నిర్మల్‌కల్చరల్, సెప్టెంబరు 16 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకంతో లబ్ధిదారులు ప్రయోజనం పొందాలని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ క్యాంపు కార్యాలయంలో విశ్వకర్మ లబ్ధిదారుగా ఎంపికైన కాల్వ గ్రామానికి చెందిన మహారాజు లక్ష్మీని సన్మానించారు. నాయకులు పాల్గొన్నారు.

ధర్మశాల నిర్మాణానికి భూమి పూజ

దిలావర్‌పూర్, సెప్టెంబరు 16 : మండలంలోని ప్రసిద్ధ పురాతన క్షేత్రం శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో ధర్మశాల నిర్మాణానికి సోమవారం దేవస్థానం చైర్మన్ సర్పాడీ వెంకట్‌రావు పాటిల్ భూమిపూజ చేశారు. నర్సాపూర్(జీ) మండలం బామ్ని(బీ) గ్రామానికి చెందిన దివంగత కదం భీంరావు, కదం శంకర్, కదం సరస్వతి బాయిల జ్ఞాపకార్థం వారి సమీప బంధువులు కదం సాయి దత్తు, సర్పాడీ దత్త హరిలు ధర్మశాలను నిర్మిస్తున్నట్లు దేవస్థానం ఈవో భూమయ్య తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు మాధవ్‌రావు పటేల్, ప్రధాన పూజారి పంచాక్షరి, దేవస్థానం పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

ఆటో, బస్సు ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

దిలావర్‌పూర్, సెప్టెంబరు 16 : మండలంలోని న్యూలోలం - దిలావర్‌పూర్ గ్రామాల మధ్య జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. నిర్మల్ నుంచి భైంసా వైపువెళ్తున్న ఆర్టీసీ బస్సు దేవుని విగ్రహాలతో ఉన్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో గ్రామాల్లో తిరుగుతూ యాచించే వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. నేషనల్ హైవే అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై రాజేశ్వర్ గౌడ్ కేసు నమోదు చేశారు.

పిప్పల్‌కోటి హత్యకేసులో మహిళ అరెస్టు

భీంపూర్ రూరల్, సెప్టెంబరు 16: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన జనకొండ నారాయణ (38) అనే రజకవృత్తి చేసుకునే వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. నారాయణ మృతదేహం మహారాష్ట్ర పిప్పల్‌గావ్ అడవిలో లభ్యం కావడంతో మాండ్వీ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా ఇప్పటికే అదే గ్రామానికి చెందిన మార్శెట్టి వినోద్, బోనగిరి దేవన్నలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పూర్తివిచారణ తరువాత ఇందులో నారాయణ భార్య విజయలక్ష్మీ ప్రమేయం ఉందని నిర్ధారించుకున్న పోలీసులు సోమవారం ఆమెను ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేశారు. తరువాత పిప్పల్‌కోటిలో ఆమె ఇంటికి తీసుకువెళ్లి మరింత విచారణ చేశారు. తరువాత కొన్ని ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అరెస్టు చేసి మండ్వీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

'కమ్యూనిస్టుల పోరాటంతోనే విలీనం'

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 16 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని కుర్రన్నపేట ప్రాంతంలోని వేయి ఉరుల మర్రి రాంజీ గోండు స్థూపం వద్ద సోమవారం తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాన్ని సీపీఐ ఘనంగా నిర్వహించింది. సాయుధ పోరాట అమరవీరులకు మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ శంకర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ రాష్ట్ర సీపీఐ చేసిన సాయుధ పోరాటం వల్లనే ఇండియాలో విలీనమైందన్నారు. 4500ల మంది కమ్యూనిస్టులు బలిదానం అయ్యారని మూడువేల గ్రామాలు విముక్తి చెందారన్నారు. 10 లక్షల ఎకరాలు భూమి పేదలకు, రైతులకు పంచారన్నారు. సాయుధ పోరాటాన్ని బీజేపీ హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తుందన్నారు. కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 21న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ నాయకులు ఎస్ఎన్. రెడ్డి, ఉపాలి, భూక్యా రమేష్, సాయి, పుండలిక్, డి. అనంత్ రావు, నజీర్, పాల్గొ న్నారు.

ఘనంగా సీపీఐ జెండా ఆవిష్కరణ

ఉట్నూర్, సెప్టెంబరు 16: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలు మరువ లేనివని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్రదేవేందర్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని పౌరసరఫరాల గిడ్డంగి వద్ద ఆయన సీపీఏఐ జెండాను ఆవిష్కరించారు. 76వ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలలో భాగంగా కార్యక్రమాలను ఘనంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌టీసీ బస్టాండ్, పాత బస్టాండ్ వద్ద కూడా జిల్లా సహాయ కార్యదర్శి సిర్రదేవేందర్ జెండాలను ఎగురవేసి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగా సాయుధ సంగ్రామంలో భూమికోసం, భుక్తి కోసం, మాతృదేశ విముక్తి కోసం అమరులైన సాయుధ పోరాట యోధులను గుర్తు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కళ్లెపల్లి గంగయ్య, జిల్లా నాయకులు గాజంగులరాజు, మండలాల నాయకులు సమీర్, రమేష్, జమీర్, గంగన్న, సర్జిల్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో చోరీ

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 16 : ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఎనుగంటి ప్రవీణ్ తన కుటుంబసభ్యులతో కలిసి ఊరికి వెళ్లగా సోమవారం తెల్లవారుజామున దుండగులు ఇంటి తాళం పగలగొట్టారు. భద్రపర్చుకున్న తులం బంగారం, 12 తులాల వెండి నగలు, రూ.20వేల నగదు తస్కరించారు. బాధితుడు మావల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేలి ముద్రల నిపుణులు ఆధారాలు సేకరించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

సిరికొండ రూరల్, సెప్టెంబరు 16: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం రాత్రి సిరికొండ మండలంలోని లక్ష్మంపూర్ గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. మారుమూల గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రైతు రుణమాఫీ విషయంలో రైతు లెవరూ ఆందోళన చెందవద్దని, ప్రతిఒక్కరికీ రుణమాఫీ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. లక్ష్మంపూర్ గ్రామంలో మొదటి విడతలోనే అర్హులైన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు అయ్యేలా కృషిచేస్తామని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీఒక హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం గ్రామస్తులు తమ గ్రామసమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ అర్చన గుణవంత్‌రావ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, సార్‌మేడి అమృత్‌రావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పాలాజ్ వినాయకుడికి ప్రత్యేక పూజలు

నేరడిగొండ, సెప్టెంబరు 16: నిర్మల్ జిల్లా భైంసా పట్టణ సమీపంలోని ఉన్న పాలాజ్ కర్ర వినాయకుడిని సోమవారం స్థానిక ఎమ్మెల్యే పవార్‌రామారావ్‌తో కలిసి పాలాజ్ కర్ర వినాయకుడిని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే దంపతులు హారతిని అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా ప్రత్యేక పూజలు అందుకుంటున్న గణనాథుడిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.అదే విధంగా ఆ విఘ్నేశ్వరుని ఆశీర్వాదాలు బోథ్ నియోజక వర్గ ప్రజల పై ఎల్లవేళాలా ఉండాలన్నారు. వీరితో పాటు ఇచ్చోడ మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, అబిరాంరెడ్డి, ధనరాజ్‌జాదవ్, స్థానిక నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : గణనాథుని ఆశీస్సులతో ప్రజలంతా చల్లగా జీవించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ వేడుకున్నారు. సోమవారం వినాయక నిమజ్జనం సందర్భంగా మండల కేంద్రంలో పలు కాలనీలలో నెలకొల్పిన వినాయక మండపాల్లో ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం వినాయక మండపాల్లో నిర్వహణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతిపటేల్, కమిటీ సభ్యులు చింతావార్ సంతోష్, ముస్లే కేశవ్, ఆడావ్ చంపత్ రావు,చ ముండే బాబు, దేవపూజ్ మారుతి, షేకావత్ దీపక్ సింగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహార్, నాయకులు సోమోరే నాగోరావు, సోన్ కాంబ్లే జితేందర్, ఎండీమసూద్, తదితరులు పాల్గొన్నారు.


వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న బోథ్ ఎమ్మెల్యే దంపతులు

పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు

● రౌండ్ టేబుల్ సమావేశంలో జేఏసీ నాయకులు వెంకటనారాయణ

ఆదిలాబాద్, సెప్టెంబరు 16: భవన నిర్మాణ కార్మిక సంక్షేమబోర్డు ద్వారా అమలవుతున్న పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దని భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వెంకటనారాయణ అన్నారు. సోమవారం టీఎన్జీవోస్ భవనంలో కార్మిక సంఘాల నాయకులతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని సంఘాల ప్రతినిధులు తీర్మానించారు. అదే విధంగా ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక శాఖ సంక్షేమ బోర్డు ద్వారా అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. కాని ఇప్పుడు దాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించేలా టెండర్లను పిలవద్దని, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం జేఏసీ పని చేస్తుందన్నారు. ఉద్యమాల్లో భాగంగా ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేసేలా కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఆశన్న,అన్నమొల్ల కిరణ్, సుభాష్, నితిన్, జగన్, వాసు, దేవిదాస్, నర్సింగ్, వెంకట్‌రావ్, హన్మండ్లు, సుమన్, వామన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి లక్ష్యం

●ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 16 : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇందులో భాగంగా గ్రామంలో సుమారు రూ.20 లక్షల నిధుల వ్యయంతో తాలూకా మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 16 : భూమి కోసం భుక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని బీజేపీ మతాల మధ్య జరిగిన పోరాటంగా వక్రీకరించి రాజకీయ లబ్ధిపొందే ప్రయత్నం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీని చేపట్టారు. పార్టీ కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో పోరాటం జరిగిన తీరును వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ నిజాం సర్కార్, పెత్తందారులకు వ్యతిరేకంగా కులమతాలకు అతీతంగా తెలంగాణ సాయుధ పోరాటం సుదీర్ఘంగా కొనసాగిందన్నారు. ఇందులో దాదాపు నాలుగు వేలకు పైగా మంది అమరులయ్యారని తెలిపారు. ఎంతో మంది వారి ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. అయితే భూమికోసం, భుక్తి కోసం జరిగిన పోరాటం తప్పా హిందు, ముస్లింల మధ్య జరిగినది కాదు అన్న వాస్తవ సత్యాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బండిదత్తాత్రి, లంకరాఘవులు, బండిదత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, పూసంసచిన్, చిన్నన్న, లంక జమున, సురేందర్, మంజుల, శకుంతల, పూసంసచిన్, స్వామి ఆశణ్ణ, సురేందర్, విజయ, దేవిదాస్, రమాకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మందమర్రి టౌన్, సెప్టెంబరు 16: ఈనెల17నుంచి కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛత ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో ఆయన మాట్లాడారు. గనులు, డిపార్టుమెంట్ల పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలన్నారు. సరియైన పద్ధతిలో రికార్డులను భద్రపర్చడం, తదితర అంశాలు ఈ కార్యక్రమంలో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం 14రోజులపాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రవిందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో అన్ని రకాల వైద్య సేవలు

● ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జై సింగ్

ఆదిలాబాద్, సెప్టెంబరు 16: ఆదిలాబాద్‌రిమ్స్ డైరెక్టర్‌రాథోడ్ జై సింగ్, డాక్టర్ జక్కుల శ్రీకాంత్‌ను దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు సోమవారం శాలువాలతో సత్కరించారు. రిమ్స్ అను బంధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అంకాలజీ వైద్య నిపుణులు జక్కుల శ్రీకాంత్ సమస్యాత్మక క్యాన్సర్ శస్త్ర చికిత్సలు చేసినందుకు వారిని సత్కరించారు. ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందు బాటులో ఉన్నాయని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ జైసింగ్ అన్నారు.

'నిందితులను కఠినంగా శిక్షించాలి'

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 16 : కోల్‌కతాలో ఇటీవల వైద్యురాలిపై జరిగిన ఆత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదిలాబాద్ రిమ్స్ జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశా రు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం రిమ్స్ జూనియర్ డాక్టర్ క్యాంపస్ ఆవరణలో డాక్టర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని కోరుతూ గణేష్ మండపం వద్ద వైద్యులు పూజలు నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 16 : ఆదిలాబాద్‌లోని హమాలివాడ, చిలుకూరి లక్ష్మీనగర్ పట్టణ పీహెచ్‌సీలతోపాటు రిమ్స్‌లోని మలేరియా నిర్ధారణ పరీక్ష ల్యాబ్‌ను డీఎంహెచ్‌వో కృష్ణ పరిశీలిం చారు. ఈ సందర్భంగా రక్త నమూనాల స్లైడ్‌లను మైక్రోస్కోప్‌లో పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదైన భీంసరి గ్రామాన్ని సందర్శించారు. ఆయన వెంట డీఎంఓ శ్రీధర్, వైద్య సిబ్బంది బండారి కృష్ణ ఉన్నారు.

మూడు కిలోల గంజాయి పట్టివేత

జైనూరు, సెప్టెంబరు 16: మండలకేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా సోమవారం మూడుకిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మహారాష్ట్రలోని జివితి తాలూకాలోని సేవ్‌గాంకు చెందిన ముగ్గురు వ్యక్తులు వాహ నంలో మాలేగాంకు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న నితిన్, లియాకత్, దేవ్ రావుపై కేసున మోదు చేసి గంజాయిని స్వాధీన పర్చుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి

చింతలమానేపల్లి, సెప్టెంబరు 16: మండల కేంద్రానికిచెందిన కొంపరి కిరణ్(28) ప్రమాదవశాత్తు పోచమ్మచెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కిరణ్ కు కొంతకాలంగా మతిస్థిమితం సరిగాలేదు. శని వారం రాత్రి ఇంటినుంచి బయటికి వెళ్లిన కిరణ్ సోమవారం పోచమ్మచెరువులో మృతిచెంది కనిపించి నట్లు తెలిపారు. మృతుడి తండ్రి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపు తున్నట్లు తెలిపారు.

నాలుగు వాహనాల్లో 64 పశువులు

● పట్టుకున్న పోలీసులు ● 11మందిపై కేసు నమోదు

సిర్పూర్(టి), సెప్టెంబరు 16: సిర్పూర్(టి) పోలీసు స్టేషన్‌పరిధిలో సోమవారం తెల్లవారుజామున నాలుగువాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 64 పశువులను పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివ రాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు నాలుగు వాహనాలను పట్టుకొని పరిశీలించగా అందులో 64పశువులు ఉన్నట్లు తెలిపారు. వాటిని మహారాష్ట్ర నుంచి నిజామాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. పశువులను స్వాధీన పర్చుకొని గోశాలకు తరలించినట్లు తెలిపారు. కాగా పశువులను తరలిస్తున్న నాగ్‌పూర్‌కు చెందిన సలీం ఖురేషి, షేక్‌తౌసిఫ్, షేక్ సోహైల్, షేక్‌తౌహిద్, మోసిన్ ఖాన్, షేక్‌నదీం, సచిన్, రాంటెంకి శైలేష్, షేక్ హనీస్, రమేష్‌కుమార్, ఎండీ యూనిస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సింగరేణిలో కార్మికులకు

ఐఎన్టీయూసీ అండ : యూనియన్ నాయకులు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 16: కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఐఎన్టీయూసీ ముందుంటుందని యూనియన్ నాయకులు కాంపెల్లి సమ్మయ్య, దేవిభూమయ్య తెలిపారు. కేకే5 గనిపై వారు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తు న్నామన్నారు. కార్మికులకు సమస్యలు ఉంటే తమ డెలిగేట్‌లకు తెలియజేయాలన్నారు. అంతే కాకుండా పెద్దసమస్యలు ఉంటే తమ కార్యాలయానికి వస్తే లెటర్లు టైపు చేసి ఉన్నతస్థాయి అధికారులతో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఆర్టీసీ బస్సులో చోరీ

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 16 : బాసర నుండి భైంసా వెళ్తున్న ఆర్టీసీ బస్సులో సోమవారం రోజు దొంగతనం జరిగిది. ఇందులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికుల మూడు ఫోన్లు దొంగలు దొంగిలించారు. దీంతో బాధితులు ఆలస్యంగా గమనించి వెంటనే బస్సు డ్రైవర్‌కు తెలిపారు. డ్రైవర్ వెంటనే బస్సును ముథోల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసులు బస్సులో ఉన్న ప్రయాణికులను తనిఖీ చేశారు. అయినప్పటికీ చోరీకి గురైన ఫోన్లు దొరకలేదు. దొంగతనానికి పాల్పడే వ్యక్తి వచ్చే రూట్‌లో ఎక్కడైనా దిగి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

'నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి'

కుంటాల, సెప్టెంబరు, 16 : కుంటాల మండలంలోని ఆయా గ్రామాలలో మంగళవారం నిర్వహించే వినాయక నిమజ్జన ఉత్సవాలను నిర్వాహకులు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై భాస్కరాచారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన సమయంలో విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డీజేలకు అనుమతి లేదని తక్కువ సౌండ్‌తో డీజేలను నడపాలన్నారు. సరైన సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంతమైన వాతావరణంలో తమ పోలీసుసిబ్బందికి సహకరిస్తూ ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఆదిదేవుడికి ఎమ్మెల్యే దంపతుల పూజలు

ఉట్నూర్, సెప్టెంబరు 16: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న గణేష్ మండపంలో చివరిరోజైన సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ దంపతులు ఘనంగా పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా వినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతుల తరఫున భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

'పెన్షన్ మంజూరు చేయండి'

నార్నూర్, సెప్టెంబరు 16: వికలాంగుడు అయిన నాకు ప్రభుత్వం వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని మండలంలోని తడిహత్నూర్ గ్రామానికి చెందిన గిరిజనుడు కుడ్మెత బాపురావు(54) ప్రభుత్వాన్ని కోరుతున్నాడు. గత 15 సంవత్సరాల క్రితం చిన్న పాటి దెబ్బ తగిలి సెప్టిక్ అయింది. పరిస్థితి విషమించింది. వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు వెళ్తే నశించిన భాగానికి ఆపరేషన్ చేసి ఒక్కకాలుని తీసి వేయడం జరిగింది సంబంధిత అంశాల పై సదరం ధృవపత్రం ఉండి ఎంపీడీఓ కార్యాలయంకి దరఖాస్తు చేసుకున్న అధికారులు నాకు పెన్షన్ మంజూరు చేయడం లేదంటూ అని ఆరోపించారు. రోజుకు కుటుంబపోషణ భారంగా మారడం ముగ్గురు పిల్లలు, భార్య ఉన్నారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న మాకుటుంబాన్నిప్రభుత్వం ఆదుకోవాలని అంటున్నాడు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

జైనథ్ రూరల్, సెప్టెంబరు 16: మండలంలోని కరంజి గ్రామానికి చెందిన రాజకీయ నాయకుడు చిట్లమల్లారెడ్డి తల్లి శివమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్న సోమవారం మండలంలోని కరంజి గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. దీంతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు వచ్చి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరీ మాజీ చైర్మన్ లోకభూమారెడ్డి, జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా అధ్యక్షులు ఆర్.రమేష్, జైనథ్ మాజీ ఎంపీపీ ఎస్.లింగారెడ్డి, ఆదిలాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్‌లతో పాటు కరంజి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన శ్రీకాంత్‌రెడ్డి

మావల, సెప్టెంబరు 16: టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేష్ కుమార్‌గౌడ్‌ను కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన్ను శాలువాతో సన్మానించి శుభాంకాంక్షలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూతనంగా పీసీసీ అధ్యక్షుడు నాయకత్వంలో కాంగ్రెస్ అత్యధిక స్థానాల్లో గెలవబోతుందన్నారు.

పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు

భోథ్, సెప్టెంబరు 16: మండలంలోని మర్లపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో సోమవారం మధ్యాహ్నం బోథ్ ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో దాడిచేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15,950 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

దస్తురాబాద్, సెప్టెంబరు 16 : మండలంలోని రేవోజిపేట్ గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు పూజలు అందుకున్న గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా భజనలు చేస్తూ గణనాథుడిని గంగమ్మ ఒడికి చేర్చారు. ఇందులో ఆలయ అర్చకులు వంశీకృష్ణ, కార్తీక్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

లడ్డూ వేలం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 16 : మండల కేంద్రంలోని శ్రీ సాయి అభిమన్యు యూత్ యొక్క గణేష్ ఉత్సవాల్లో గణపతి దేవుడి లడ్డు వేలం వేయడం జరిగింది. ఈ వేలంలో నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కృష్ణచౌహాన్ గణపతి దేవుడి లడ్డును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గణపతి దేవుడి ఆశీర్వాదం ద్వారా నాకు ఈ లడ్డు దొరకడం చాలా అదృష్టం అని కృష్ణ చౌహాన్ అక్కడ యువకులకు కృతజ్ఞతలు తెలియజేసి దేవుడి ఆశీర్వాదనం తీసుకోవడం జరిగింది.

CLASSIFIEDS

PLOT FOR SALE

★ మంచిర్యాలను ఆనుకొనివున్న తిమ్మాపూర్‌లో ఒక స్థలం 242 చదరపు గజాలు కలిగిన నార్త్ ఈస్ట్ ప్లాట్ అమ్మకమునకు కలదు. కావాల్సిన వారు సంప్రదించగలరు.
Ph: 9490929449 / 9949662211
AJK-201528

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి
దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజూ... క్లాసిఫైడ్స్



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
ఆదిలాబాద్ : 99854 11291, నిర్మల్ : 80966 77672







ఆదిలాబాద్ పట్టణంలో ప్రతిష్ఠించిన భారీ గణనాథుల ప్రతిమలు



● పెన్‌గంగా నది వద్ద ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది



● పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ


నిమజ్జనంపై.. నిఘా



● పెన్‌గంగా నది వద్ద సీసీ కెమెరాలు



● నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ క్రేన్‌లు



● పెన్‌గంగానది



● పెన్‌గంగా నది వద్ద పోలీసుల బేస్ క్యాంపు

- జిల్లాలో నేడు గణేష్ ప్రతిమల నిమజ్జనం
- గంగమ్మ ఒడికి చేరనున్న గణనాథులు
- నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి
- శోభాయాత్ర వెంట అడుగడుగునా కట్టుదిట్టమైన భద్రత
- ప్రధాన కూడళ్లలో 200 వరకు సీసీ కెమెరాల ఏర్పాటు
- జిల్లావ్యాప్తంగా సుమారుగా 1600 గణేష్ మండపాలకు అనుమతులు

ఆదిలాబాద్, సెప్టంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయక నిమజ్జన ఘట్టాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసులు ప్రత్యేకదృష్టిని సారించారు. నవరాత్రులు పూజలు అందుకున్న వినాయక విగ్రహాలను మంగళవారం ఘనంగా నిమజ్జనం చేసేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రులు ప్రారంభమైనప్పటి నుంచి అప్రమత్తమైన పోలీసులు గణేష్ మండపాల నిర్వాహకులకు అవగాహన పలు సలహాలు సూచనలు చేస్తూ వస్తున్నారు. గతంలో మాదిరిగానే ఈ ఏడు ఆన్‌లైన్ ద్వారా గణేష్ మండపాలకు అనుమతి తీసుకోవాలని చెప్పడంతో జిల్లావ్యాప్తంగా సుమారుగా 1600 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. పోలీసు శాఖతో పాటే రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖాధికారులు కలిసికట్టుగా నిమజ్జన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంలు నిరంతరంగా పర్యవేక్షణ చేస్తూ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు.

ఐజీ స్థాయి అధికారి పర్యవేక్షణ

మునుపెన్నడు లేనివిధంగా జిల్లాలో వినాయక నిమజ్జనంపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకదృష్టిని సారించారు. ఏకంగా ఐజీ స్థాయి అధికారి నిమజ్జన కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. గత నాలుగైదు రోజుల క్రితమే జిల్లాకు చేరుకున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి జిల్లాకేంద్రంలోని పలు గణేష్ మండపాలను సందర్శించారు. అలాగే విగ్రహాలను నిమజ్జనం చేసే చాందా(టి) వాగుతో పాటు పెన్‌గంగా నది వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా అధికారుల తో ప్రత్యేకంగా సమావేశమై పలు సలహాలు, సూచనలు చేశారు. పొరుగున ఉన్న ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలంలో ఇటీవల జరిగిన అల్లర్ల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాపై స్పెషల్ ఫోకస్‌ను పెట్టినట్లు తెలుస్తుంది. అయితే, ఎలాంటి మత ఘర్షణలు జరగకుండా కట్టడి చేసేందుకు ముందస్తు చర్యలు చేపట్టింది.

గట్టి బందోబస్తు

ఈసారి వినాయక నిమజ్జన కార్యక్రమానికి పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఐజీ, ఎస్పీ ఆదేశాలతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లాకేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లలో 200 వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే డ్రోన్, మరో ముగ్గురు వీడియో గ్రాఫర్లను నియమించారు. ఎస్పీతో పాటు ఇద్దరు ఏఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 30 మంది ఎస్సైలు, 54 మంది సీఐలు వందలాది మంది స్పెషల్ పోలీసులు, మరో 250 మంది ట్రైనీ కానిస్టేబుల్స్, ఏఆర్, సివిల్, స్పెషల్ పార్టీ బలగాలను వినాయక నిమజ్జన శోభాయాత్రలో విధులు నిర్వహించనున్నారు. మొత్తానికి కట్టుదిట్టమైన బందో బస్తును కల్పిస్తున్నారు. కొన్ని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకదృష్టిని సారించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

క్లస్టర్ల వారీగా స్పెషల్ ఆఫీసర్లు

గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు క్లస్టర్ల వారీగా స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. జిల్లా కేంద్రంలో 11 సెక్టార్లు 7 క్లస్టర్లుగా విభజించారు. ఒక్కో సెక్టార్‌కు ఎస్సై స్థాయి అధికారిని నియమించారు. అలాగే క్లస్టర్లకు సీఐ స్థాయి అధికారులు స్పెషల్ ఆఫీసర్లుగా కొనసాగుతారు. సెక్టార్స్, క్లస్టర్లపై డీఎస్పీలు, ఏఎస్పీలు, ఎస్పీ నిరంతరంగా పర్యవేక్షణ చేయనున్నారు. వినాయక్ చౌక్, దేవిచంద్ చౌక్, అంబేద్కర్ చౌక్, శివాజీ చౌక్, ఠాకూర్ హోటల్, అలాగే నేతాజీ చౌక్, అంబేద్కర్ చౌక్, పంజాబ్ చౌక్ మీదుగా గణనాథులను నిమజ్జనానికి గంగమ్మ ఒడికి తరలించనున్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెండు భారీ క్రేన్‌లు, మరో రెండు లారీలను ఏర్పాటు చేశారు. ఈసారి డీజేలు, బాణాసంచా కాల్చడానికి అనుమతి లేదని పోలీసులు చెప్పినప్పటికీ మండపాల నిర్వాహకులు మాత్రం భారీగా ఏర్పాట్లను చేస్తున్నారు.

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

: జీవన్‌రెడ్డి, డీఎస్పీ, ఆదిలాబాద్

ప్రజలంతా గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి. జిల్లాకేంద్రంలో పోలీసు భద్రత ఉంటుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటాం. 24 గంటల పాటు పోలీసులు అప్రమత్తంగా ఉంటారు. ప్రత్యేకంగా నిమజ్జన కార్యక్రమంపై డ్రోన్ కెమెరాలతో నిఘా సారిస్తాం. బాణాసంచా కాల్చడం, డీజేల ఏర్పాటుకు అనుమతి లేదు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు.

సంక్షిప్త సమాచారం



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ విజేందర్

నేడు వైన్స్‌ల మూసివేత

ఆదిలాబాద్, సెప్టెంబరు 16: జిల్లాకేంద్రంలో ఈ నెల 17వ తేదీన మంగళవారం మద్యం దుకాణాల (వైన్స్‌లు)ను మూసివేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. పట్టణంలో మంగళవారం వినాయక నిమజ్జనం శోభాయాత్రను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం వ్యాపారులు ఎవరైనా ఈ సమయాల్లో విక్రయాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తిరిగి బుధవారం యధావిధిగా దుకాణాలు తెరుస్తారని పేర్కొన్నారు.

'ఉపాధ్యాయులను నియమించాలి'

నార్నూర్, సెప్టెంబరు 16: గాదిగూడ మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ కళాశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులు లేక విద్యార్థినిలు గత కొన్ని నెలలుగా విద్యకు దూరం అవుతున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ప్రాంతాన్ని సందర్శించి ఇక్కడ సమస్య పరిష్కారం చేయాలని ప్రజలు విన్నవించినా.. అధికారులు ఎవరూ స్పందిస్తలేరని, వెంటనే ఉన్నతాధికారులు సిబ్బంది నియమించి విద్యార్థులకు విద్య బోధన అందించాలని ఏఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి సంతోష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

మాల సంఘ మండల కమిటీ ఎన్నిక

నేరడిగొండ, సెప్టెంబరు 16: మాల సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నక్క మహేందర్, ఉపాధ్యక్షుడిగా మద్దెల నారాయణస్వామి, గౌరవ అధ్యక్షుడిగా అనుపట్ల సంజీవ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మద్దెల అడెల్లు, కోశాధికారిగా కుర్మె నారాయణ స్వామి, సభ్యులుగా ద్యావంత్ లక్ష్మణ్, బొబ్బిలి నాగన్న, అశోక్, నవీన్, అనిల్, భాస్కర్, గంగారాం, శ్రీనివాస్, నరేష్, సాగర్‌లను ఎన్నుకున్నారు. కాగా నేరడిగొండ గ్రామ అధ్యక్షులుగా చిప్పరి రాజేశ్వర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఆయా గ్రామాల మాల సంఘాల సభ్యులు సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాల సంఘం అభివృద్ధి కోసం తమవంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈకమిటీ ఎన్నికల అధికారులుగా జిల్లా నాయకులు సుభాష్, ప్రేమ్‌సాగర్, తదితరులు వ్యవహరించారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయండి

బోథ్, సెప్టెంబరు 16: మండలంలోని సోనాల గ్రామం కొమురం భీమ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన హైమస్ట్ విద్యుత్ స్తంభం వాహనం ఢీకొట్టి విరిగిపోయిందని, దాన్ని ఏమాత్రం పట్టించుకోకపోవడం వల్ల రాత్రిపూట చిమ్మచీకటిగా ఉందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. విరిగిన స్తంభం వద్ద హైమస్ట్ లైట్లు, స్తంభం ఏర్పాటు చేసే విధంగా పంచాయతీ వారు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఉట్నూర్‌లో నిమజ్జనం కార్యక్రమానికి హాజరైన భక్తులు





..నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథులు



క్రేన్ సహాయంతో గంగన్నపేట సాగర్‌లో నిమజ్జనం చేస్తున్నారిలా..

నయనానందకరం.. నిమజ్జనోత్సవం

● ఉట్నూర్‌లో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణనాథుల ప్రతిమల శోభాయాత్ర ● పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు

ఉట్నూర్, సెప్టెంబరు 16: నవరాత్రుల పాటు శివపార్వతుల తనయుడు వినాయకుడికి ఘనంగా పూజలు చేసిన భక్తులు సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో నయనానందకరంగా వినాయక నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించారు. ఉట్నూర్ పట్టణంలోని పలు వీధులలో నెలకొల్పిన గణేష్ విగ్రహాలను గణేష్ మండపాల నిర్వాహకులు ప్రత్యేక పూజల అనంతరం ట్రాక్టర్లపై చేర్చి శోభాయాత్రలో పాల్గొన్నారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వినాయక చౌక్‌లో కాషాయజెండా వద్ద, భరతమాత చిత్రపటం వద్ద ఆహ్వానితుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పూజారి బాలాజి దుబే ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉట్నూర్ పట్టణంలోని హనుమాన్ మందిరంలో ప్రతిష్ఠించిన సార్వజనిక్ గణేష్ మండలి విగ్రహాన్ని రథంపై ఉంచి శోభయాత్రలో ముందు వరుసలో ఉంచారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆహ్వానించబడ్డ ప్రముఖ ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘ కార్యకర్తలు హాజరై భక్తులకు నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీ నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యేబొజ్జు పటేల్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్‌మర్మాట్, డీఎస్పీ నాగేందర్, సీఐ గండికోట మొగిలి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మాజీ జడ్పీ ఛైర్మన్ రాథోడ్‌జనార్దన్, మండల ప్రత్యేక అధికారి సుధాకర్, పంచాయతీ ఈఓ ఉప్పరి శంకర్‌ల ఆధ్వర్యంలో హిందు ఉత్సవ సమితి అధ్యక్షుడు కొండేరి రమేష్, ప్రధాన కార్యదర్శి సంజీవ్‌రెడ్డి, కోశాధికారి కేంద్రీ సంతోష్‌లు కలిసి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వక్త ఆర్ఎస్ఎస్ ప్రతినిధి దత్తగిరి గణపతి నవరాత్రులపూజ ఫలితాల గురించి వివరించారు.అనంతరం మండపాల నిర్వాహకులు ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాల శోభయాత్ర వినాయక్‌చౌక్ నుంచి పట్టణంలోని వీధుల గుండా గంగన్నపేట సాగర్ వరకు సాగింది. ఈ సందర్భంగా విగ్రహాల వద్ద ఆయా గణపతి మండపాల నిర్వాహకులు మహిళలు, పురుషులు, పిల్లలు సైతం ఆనందోత్సవాల మధ్య నృత్యాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్సై మనోహర్‌ల ఆధ్వర్యంలో పోలీసు అధికారులు బందోబస్తు చర్యలు నిర్వహించారు.



బజార్‌హత్నూర్‌లో భజనలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

● గంగమ్మ ఒడికి గణనాథులు

ఇంద్రవెల్లి: తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరుకున్నారు. వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో వినాయక నిమజ్జనం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక మండపాల నిర్వాహకులు స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు అన్నదానాలు చేశారు. పలు చోట్ల లడ్డూ వేలం పాట నిర్వహించారు. అందంగా అలంకరించిన శకటంపై వినాయక విగ్రహాలను ఉంచి మహిళలు, చిన్నా, పెద్దా నృత్యాలు చేస్తూ వినాయకుడి శోభయాత్ర ఘనంగా నిర్వహించారు. అనంతరం వినాయకులను ఏమైయికుంట గ్రామ సమీపంలోని చెరువు వద్ద నిమజ్జనం చేశారు. ఉట్నూర్ సీఐ మొగిలి ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్‌తో పాటు 30 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ డోంగ్రే మారుతి పటేల్, కమిటీ సభ్యులు చింతావర్ సంతోష్, ముస్లే కేశవ్, అడావ్ చంపత్‌రావు, ముండే బాబు, దేవపూజ్ మారుతి, షేకావత్ దీపక్‌సింగ్, కాగ్నే గను, తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో వినాయక నిమజ్జనం శోభాయాత్ర

● భక్తిశ్రద్ధలతో గణపతి శోభాయాత్ర

బజార్‌హత్నూర్: మండలకేంద్రంలోని పులాజీబాబా కాలనీలోని గణపతి మండపం నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలతో సంప్రదాయబద్ధంగా గణపతి శోభాయాత్రను నిర్వహించారు. మహిళలు, యువకులు, గ్రామస్థులు భజన కార్యక్రమంలో పాల్గొని భక్తి కీర్తనలతో సాగిన శోభాయాత్ర చూసేందుకు భక్తులు తరలి వచ్చారు.

'ఆదివాసీ గోండు మహిళకు న్యాయం జరిగేలా చూడాలి'

ఉట్నూర్, సెప్టెంబరు 16: ఉమ్మడి జిల్లాలోని జైనూర్ సంఘటనలో బాధితురాలికి న్యాయం జరిగేలా ఖానాపూర్ ఎమ్మెల్యే చొరవ చూపాలని ఆదివాసీ సంఘాల నాయకులు ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ను కోరారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఖానాపూర్ శాసన సభ్యుడు వెడ్మ బొజ్జుపటేల్ క్యాంపు ఆఫీస్‌లో రాజ్‌గోండు సేవా సమితి గొండ్వాన పంచాయతీ రాయి సెంటర్ ఆధ్వర్యంలో జైనూరు జరిగిన ఘటన గోండు ఆదివాసీ మహిళపై ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు ఖానాపూర్ శాసన సభ్యుడు కృషి చేయాలని కోరారు. గోండు, కోలాం, పర్ధాన్, నాయక్‌పోడ్, తోటి, అంద్ ఆదివాసీ నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొమురంభీం జిల్లా జైనూరు మండల కేంద్రంలో జరిగినటువంటి ఘటనలో ఆదివాసీలపై కేసులను ఆపి వేయాలని, అట్లాగే ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చలు జరిపేందుకు ఖానాపూర్ శాసన సభ్యుడు చొరవ తీసుకోవాలని కోరడంతో ఎమ్మెల్యే స్పందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ నాయకులను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసి జైనూరు ఘటనపై న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిడం అర్జు, రాష్ట్ర అధ్యక్షుడు పెందూరు ప్రభాకర్, రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు, సిడాం గంగాధర్, రాజ్‌గోండు సేవ సమితి జిల్లా అధ్యక్షుడు వెడమ కొద్దు, జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం నీరంజన్, బొంత ఆశారెడ్డి, మడావి బాలాజి, గుడిపల్లి భీమన్న, పుర్క గజానంద్, మేస్రం కేశవ, డివిజన్ ఉపాధ్యక్షులు మరప పురుషోత్తం, జిల్లా కార్యదర్శి ఆత్రం నారాయణ, ఉట్నూర్ మండల నాయకులు పెందూరు చంద్రకళ, కుంరరవి, ఆత్రం లక్ష్మణ్, ఆత్రం గజానంద్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బొజ్జుకు వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ నాయకులు

సదా మీ సేవలో...

పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్న యెడల ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..

ఆదిలాబాద్ - 93983 85917

ఇచ్చోడ - 85000 38312

అసిస్టెంట్ సర్కులేషన్ మేనేజర్: 99854 11454

బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451